ప్రజాశక్తి

శనివారం 8 మార్చి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

కథనం 8లో..

అన్నింటా ఆమె

- సమాజాభివృద్ధిలో కీలకపాత్ర
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

బ్లూ ఫ్లాగ్‌పై రాద్ధాంతం !

- గుర్తింపు రద్దు నేపథ్యంలో జిల్లా అధికారులపై ఇప్పటికే బదిలీ వేటు
- దిద్దుబాటు చర్యలకు దిగిన ప్రభుత్వం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రుషికొండ ప్రాంతం నిత్యం ఏదో ఒక వివాదానికి కేంద్రంగా ఉంటూ వస్తోంది. గత ప్రభుత్వం రుషికొండపై కట్టిన టూరిజం భవంతులు వివాదమైన విషయం తెలిసిందే. తాజాగా నగరంలోని రుషికొండ బీచ్‌కు బ్లూ ఫాగ్ (పరిశుభ్రతకు చిహ్నామైన నీలి రంగు తీరం) గుర్తింపు రద్దయిందన్న వార్తలతో స్థానిక భీమునిపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రంగంలోకి దిగి పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రయత్నాలు ఆరంభించారు. సాగర తీరం అంతటా అపారిశుధ్య పరిస్థితులు తాండవిస్తున్న మాట నిజమే. జివిఎంసి, ఎపి టూరిజం, విఎంఆర్‌డిఎ, పోలీస్ శాఖ ఇతర ఇంకొన్ని శాఖల సమన్వయంతో బీచ్‌ల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నా గడచిన కొద్దినెలలుగా గాలికొదిలేశారన్న విమర్శలైతే వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బ్లూ ఫాగ్ గుర్తింపు రద్దుతో రాజకీయ రాద్ధాంతం నడుస్తోంది.

అధికార యంత్రాంగం మెడపై కత్తి వేలాడుతోందా ?

కోపెన్ హెగెన్‌కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఇఇ) బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్‌ను జారీచేస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థే ఈ సర్టిఫికెట్ హోదాను నిలిపివేసిందన్న ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ కలెక్టర్ కె.జ్ఞానవేణిని జిల్లా పర్యాటక అధికారి హోదా నుంచి మాతృశాఖకు తక్షణమే ప్రభుత్వం బదిలీ చేసింది. ఎపిటిడిసి ఎమ్‌డిని కూడా బదిలీ చేస్తూ రాష్ట్ర ఎపిటిడిసి ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ రెండు చర్యలూ రాష్ట్ర ప్రభుత్వ సిఎం కార్యాలయం నుంచి జరిగాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఇంకొందరి మెడపైనా కత్తి మిగతా 2లో..

కైలాసగిరిపై అలుముకున్న దట్టమైన పొగ

కైలాసగిరిపై అగ్నిప్రమాదం

వార్త మెయిన్‌లో..







మొదటి పేజీ తరువాయి..

బ్లూ ఫ్లాగ్‌పై రాద్ధాంతం !

వేలాడుతున్నట్టు సమాచారం.

ప్రమాణాల మాటేమిటి ?

సాగర తీరాల్లో పరిశుభ్రత, ఇతర ఆరోగ్య ప్రమాణాలనేవి పరిపాలనా నిర్వహణలో భాగంగానే జరగాల్సిన పనులు. అవసరమైనంత మంది పారిశుధ్య సిబ్బంది రుషికొండ బీచ్‌లో విధులు నిర్వహించడానికి ఉండాలి. కానీ తక్కువ మంది ఉన్నారు. పండగలు, ప్రత్యేక రోజుల్లో ఇక్కడకు పెద్ద ఎత్తున పర్యాటకుల తాకిడి ఉంటుంది. సుమారు లక్ష మంది వరకూ వస్తుంటారు. వారికి సౌకర్యాల కల్పన కత్తిమీది సాములా మారింది. జిల్లా అధికార యంత్రాంగంపై పై నుంచి ఒత్తిళ్లూ ఉన్నాయి. రుషికొండ బీచ్‌కు బ్లూ ఫాగ్ ట్యాగ్ (దేశంలో 10 బీచ్‌ల్లో ఇది ఒకటి) గతంలో దక్కింది. కొద్ది నెలలుగా ఈ ప్రాంత పర్యాటక సొబగుల విషయంలో పాలనాపరమైన వైఫల్యం కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి సర్కారు ఒక్క రుషికొండ ప్రాంతాన్నే కాదు తీరం అంతటా పర్యాటక రద్దీ పెరిగిపోతున్నా పెద్దగా పట్టించుకున్న దాఖలా లేదు. ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. ఆ సమస్యలన్నింటినీ పరిష్కరించాల్సి ఉంది. వాస్తవానికి రుషికొండ బ్లూ ఫ్లాగ్ సమస్య పెద్ద సమస్యేమీ కాదు. పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తే సమస్య పరిష్కారమవుతుంది. కానీ ఈ విషయాన్ని రాజకీయం చేస్తున్నారు. వైసిపి, టిడిపిలు పరస్పర విమర్శలకు దిగుతున్నాయి. ఎపికి ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అంశాలు పట్టని ప్రధాన పార్టీల నేతలు బ్లూ ఫాగ్‌పై తప్పు మీదంటే మీదే అని రాద్ధాంతానికి దిగుతున్నారు.

దిద్దుబాటు చర్యలు

రుషికొండ దిద్దుబాటు చర్యల పేరుతో రూ.కోట్ల ఖర్చుకు ప్రజాప్రతినిధులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ.15 కోట్లతో సాగర్‌నగర్ బీచ్ సుందరీకరణ పనులు చేపట్టబోతున్నారు. సాగర్ నగర్‌లో రూ.2 కోట్లు, రుషికొండలో రూ.2 కోట్లతో ఈటర్స్ జోన్లు ఏర్పడబోతున్నాయి. ఈ నిధుల్లో కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు చొప్పున అందించనుంది. అలాగే ఇస్కాన్ టెంపుల్‌కు ఎదురుగా రూ.9 కోట్లతో 20 ఎకరాల్లో సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇలా విశాఖ పర్యాటకులను ఆకట్టుకునే చర్యల దిశగా మాజీ మంత్రి, భీమిలి ఎంఎల్‌ఎ గంటా శ్రీనివాసరావు దిద్దుబాటు చర్యలు ఆరంభించారు. ప్రత్యేకంగా సిసి కెమెరాలు, సెక్యూరిటీ, పార్కింగ్ వంటి ప్రమాణాలు రాబోతున్నాయి. అధికార పార్టీ వారికి ఈ కాంట్రాక్టులు దక్కేలా ప్లాన్ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వాలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాలంటీర్లకు ఉగాది లోగా తీపి కబురు చెప్పాలని ఎపి గ్రామ వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గంధం దీప్తి డిమాండ్ చేశారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గ్రామ, వార్డు వాలంటీర్స్ అసోసియేషన్ అన్ని సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,రూ.10 వేలకు జీతం పెంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు చెప్పారన్నారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా వాలంటీర్లను కొనసాగిస్తామని, రూ.10 వేలు జీతం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రతిపక్షంలో ఉండేటప్పుడు వాలంటీర్లను కొనసాగిస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా వలంటీర్లను ప్రతి సంవత్సరం రెన్యువల్ చేశారన్నారు. ఎ.పి. గ్రామ వాలంటీర్ అస్సోసియేషన్ రాష్ట్ర సలహాదారులు ఈదర గోపీచంద్ (నరసరావు పేట) మాట్లాడుతూ, చంద్రబాబు వాలంటీర్లను మోసం చేశారన్నారు. వాలంటీర్లకు జీతం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. వాలంటీర్లకు మార్చి 29 తేదీ లోపు చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు వాలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, షేక్ హుమయాన్ భాషా, అసోసియేషన్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము సురేష్ బాబు, జిల్లా నాయకులు ప్రసాద్, కొండమ్మ, రాజేష్, జగదీష్, వెంకటసుబ్బయ్య, విశాఖ జిల్లా నాయకులు కోడూరు లక్ష్మణ్, రాము, పార్వతి పాల్గొన్నారు.

15 నుండి నగరంలో నథింగ్ ఫోన్ 3ఎ అమ్మకాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ నథింగ్ తమ నూతన శ్రేణి మిడ్ రేంజ్ లైనప్‌లో అడ్వాన్స్‌డ్ ఫీచర్లతో నూతన 3ఎ, 3ఎ ప్రో ఫోన్లను ఈ నెల 11 నుంచి ఆన్‌లైన్‌లోనూ, 15 నుంచి ఆఫ్ లైన్‌లో విశాఖ మార్కెట్‌లోకీ విడుదల చేయనుందని ఆ సంస్థ విశాఖపట్నం సేల్స్ విభాగం డీలర్ విజయ సేల్స్ ప్రతినిధి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫోన్లు అప్ గ్రేడ్ చేసిన గ్లాస్ బ్యాక్ ప్యానెల్స్‌తో ఆకర్షణీయమైన డిజైన్ కలిగి, 6.77 ఇంచుల స్క్రీన్‌తో ఉంటాయన్నారు. 50 మెగా పిక్సెల్ కెమెరాలతో 50 ఎంపి సెన్సార్లు కలిగి ఉంటాయని పేర్కొన్నారు. నథింగ్ 3ఎ ప్రారంభ ధర రూ.22,999 - 24,999 మధ్య, నథింగ్ 3ఎ ప్రో ధర రూ.27,999 -31,999 మధ్య ఉంటుందని తెలిపారు.

రైల్వే ఆసుపత్రిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:వాల్తేరు రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో న్యూరాలజీ, కార్డియాలజీ సంబంధిత అంశాలపై అవగాహనతో పాటు ఎండోక్రైన్‌కు సంబంధించి వైద్యశిబిరం నిర్వహించారు. విశాఖపట్నంలోని డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరం ఏర్పాటు చేశారు. చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్కే తిరువారు జ్యోతి ఆధ్వర్యంలో రైల్వే వైద్యుల బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఏసీఎంఎస్ డాక్టర్ చారుమతి , ఏసీఎంఎస్ డాక్టర్ లక్ష్మణ్ రావులు పాల్గొని ఆరోగ్య సమస్యలపై రైల్వే అధికారులకు అవగాహన కల్పించారు. మెడి కవర్ హాస్పిటల్స్ ఎండీ ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ వంశీకృష్ణ ఎండోక్రైన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై నిరంతరం దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

వడ్డీ వ్యాపారి గృహంలో...

బాధిత మహిళ ఆత్మహత్య

న్యాయం కోసం మృతురాలి కుటుంబీకులు ఆందోళన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని మహారాణిపేట అంగటి దిబ్బ ప్రాంతంలో బొడ్డు సుగుణ (35) అనే మహిళ గురువారం రాత్రి వడ్డీ వ్యాపారి ధనలక్ష్మి పడకగదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కలకలం రేపింది. శుక్రవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట మృతురాలి బంధువులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. సుగుణ ఆత్మహత్యకు వడ్డీ వ్యాపారి ధనలక్ష్మి కారకురాలని, సుగుణ తీసిన సెల్ఫీ వీడియోలో ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. సెల్ఫీ వీడియోను పోలీసులకు అప్పగించారు.

అసలేం జరిగింది ?

ఇంటి వద్ద చీరలు అమ్ముతూ సుగుణ, ఉప్పు అమ్ముతూ ఆమె భర్త అప్పన్న జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. సుగుణ తన వ్యాపార నిమిత్తం వడ్డీ వ్యాపారి ధనలక్ష్మి వద్ద రూ.లక్ష అప్పు తీసుకుంది. వడ్డీగా రోజుకు రూ.1000 చొప్పున చెల్లించేది. తీసుకున్న అప్పుకు మూడు రెట్లుకు పైగా డబ్బును సుగుణ చెల్లించింది. అయినప్పటికీ ధనలక్ష్మి వడ్డీ చెల్లించాలని, అసలు ఇవ్వాలని కొద్ది రోజులుగా డిమాండ్ చేయసాగింది. దీంతో ఆమె వేధింపులు భరించలేక సుగుణ ఆత్మహత్యకు పాల్పడిందని బంధువులు ఆరోపిస్తున్నారు. ధనలక్ష్మిని తక్షణం అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని పోలీస్ స్టేషన్ ఎదుట బంధువులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ క్రమంలో ధనలక్ష్మి చేస్తున్న వడ్డీ వ్యాపారం చట్టబద్ధమైనదా, కాదా అన్న విషయాన్ని పోలీసులు ఆరా తీస్తున్నారు. ధనలక్ష్మిపై కేసు నమోదు చేశారు.

పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన మృతురాలి కుటుంబీకులు

కనీస వేతనాల కోసం ధర్నా

ధర్నా చేస్తున్న ఆర్‌టిసి కార్మికులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కనీస వేతనాలు చెల్లించాలంటూ ఎపిఎస్ ఆర్‌టిసి కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలకా సత్యనారాయణ మాట్లాడుతూ కాంట్రాక్ట్, హైర్ బస్ డ్రైవర్లు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి జిల్లా ప్రజా రవాణా అధికారి యూనియన్ల నాయకులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షులు కెజెఎ.రావు (శివ), రాష్ట్ర కార్యదర్శి వి.తులసీరామ్ మాట్లాడుతూ ఆర్‌టిసిలో రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అతి తక్కువ జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టర్‌తో కుదుర్చుకున్న అగ్రిమెంట్ ప్రకారం కార్మికుల సమస్యలను పరిష్కారం చేయడం లేదన్నారు. కార్మిక చట్టాలు అమలు కావడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజనల్ కార్యదర్శి ఎంసిహెచ్.అప్పడు, వి.అర్జున్, డి.లక్ష్మ, వీరబాబు పాల్గొన్నారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద..

కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు చెల్లించి, రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన బోర్డును ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వాల్తేరు రైల్వే డివిజన్ కాంట్రాక్టు కార్మికులు, హిందూజా పవర్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు, శ్రావణి షిప్పింగ్ కళాసీలు, స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. వారినుద్దేశించి ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుత్‌రావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బూసి వెంకటరావు, జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు పాల్గొన్నారు.

నువ్వు ఆదివి.. ఆధారానివి

నువ్వు..
ఆదివి

నువ్వు..
ఆధారానివి

నువ్వు..
అందానివి ఆనందానివి
ఆకాశంలో సగానివి

నువ్వు..
అమ్మవి
ఆమనివి

నీ ప్రేమ
అనురాగపు మంచు పర్వతమందిరం
నువు ద్వేషించే క్షణం
ఖగోళ సూర్యగోళాల తీక్షణం

నీ శక్తి
అవధి లేని పరిధి
నీ యుక్తి
నిత్య జీవన సారధి

సాధించుమా
అగ్రసింహాసన రాజసం
సాగించుమా
నీ విజయ విలాస హాసం

అగణిత వనితా లలామలకు సలాములు

- జివివిఎస్‌వి.ప్రసాద్ బాబు, లెక్చరర్,
డాక్టర్ విఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
విశాఖపట్నం, ఫోన్ : 9492807312

వెంకటేశ్వర థియేటర్ వద్ద అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డాబా గార్డెన్స్ సరస్వతి పార్కుకు సమీపంలో ఉన్న, వెంకటేశ్వర థియేటర్‌కు ఎదురుగా శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. ఒక ఇంటిలో నుండి పొగ ఒక్కసారిగా పైకి రావడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన ఇంటికి వెలుపల రోడ్డును ఆనుకొని ఉన్న కాలువలో పేరుకుపోయిన చెత్తను పెట్రోల్ పోసి ఎవరో తగలబెట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. అందువల్లే ఈ ప్రమాదం జరిగిందని అంటున్నారు.

పి4 సర్వేకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 10 సూత్రాలను పెట్టిందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా పబ్లిక్, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో పి4 సర్వేకు రూపకల్పన చేశామని పేర్కొన్నారు. ఈ సర్వే ఈ నెల 8 నుంచి 18 వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా నిర్వహించనున్నామన్నారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

లెక్సస్ ఎల్‌ఎక్స్ 500డి ఎస్‌యువి బుకింగ్స్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లెక్సస్ ఇండియా వారి ఎల్‌ఎక్స్ 500డి ఎస్‌యువి నూతన వాహనాల బుకింగ్స్ ప్రారంభమయ్యాయని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ తన్మయి భట్టాచార్య ప్రకటించారు. సిరిపురంలోని మంత్రి హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ఎల్‌ఎక్స్ 500డి ఎస్‌యువి అత్యాధునిక డిజైన్, మెరుగైన భద్రతా ప్యాకేజీలలో భాగంగా సేఫ్టీ సిస్టం 3.0తో లభిస్తుందని తెలిపారు. మెరుగైన సౌకర్యం కోసం సీట్ మసాజర్, కొత్త ఎయిర్ బ్లాడర్ ఆధారిత రిక్లైనింగ్ సీటును కలిగి ఉంటుందని పేర్కొన్నారు. ఈ వాహనం అర్బన్ ఎక్స్ షోరూమ్ ఆల్ ఇండియా ధర రూ.3 కోట్లుగాను, ఓవర్ ట్రైల్ ధర 3.12 కోట్లుగాను ఉందని తెలిపారు.

మహారాజశ్రీ ఫ్యామిలీ జడ్జి వారి కోర్టులో, విశాఖపట్నం
F.C.O.P. 868/2023
బిట్వీన్:
1) శ్రీమతి పుప్పాల సుప్రజ
2) చి॥ పుప్పాల నుష్క
(2వ పిటీషనర్ మైనర్ యొక్క తల్లిగారైన మొదటి పిటీషనర్) ...పిటీషనర్స్
అండ్
శ్రీ పుప్పాల అశోక్ కుమార్ ...రెస్పాండెంటు
నోటీసు
టు, దీ రెస్పాండెంటు:
శ్రీ పుప్పాల అశోక్ కుమార్,S/o.పి.సత్యారావు హిందు, వయస్సు: 47 సం॥లు, నివాసం: ఫ్లాట్ నెం. 308, యం.కె. ప్రెస్టేజ్ అపార్ట్‌మెంట్, లక్ష్మివానిపాలెం, పి.యం. పాలెం, మధురవాడ 1వ బస్టాప్, విశాఖపట్నం-41
ఇందుమూలంగా పైరెస్పాండెంట్‌కి తెలియజేయునది ఏమనగా పైనెంబరు పిటీషన్‌లో శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం మీకు ఎన్ని సార్లు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు నోటీసు పేపరు ప్రకటన ద్వారా మీకు ఆర్డరు వేసినారు. కావున మీకు తేది. **26-03-2025** కి వాయిదా అయివున్నది. సదరు తేదిన మీరు **ఉ॥గం॥ 10.30ని॥**లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని లేదా లాయరు గారిద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షములో పిటీషన్ విచారణచేసి తీర్మాణించబడునని తెలియజేయడమైనది. (By Order of the Hon'ble Court)
KOMMU PADMAJA, Advocates
Visakhapatnam. **Cell: 94406 36066**

పారదర్శకంగా రీ-సర్వే : కలెక్టర్

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లిలో జరుగుతున్న రీ సర్వే, ఈ పంట నమోదును విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. రీ-సర్వేను పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. డ్రోన్, రోవర్ ద్వారా రీసర్వే జరిగిన తీరును సునిశితంగా పరిశీలించారు. సర్వే పూర్తయిన తర్వాత గ్రామసభ నిర్వహించాలని, పూర్తి వివరాలను రైతుల ముందు ఉంచాలని చెప్పారు. రైతుల వినతులను, ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక రైతులతో కలెక్టర్ మాట్లాడి రీ-సర్వే, ఇతర సేవలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

పర్యటనలో భాగంగా గొట్టిపల్లి గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. పలు నివేదికలను, సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించిన ఆయన సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రజలకు వైద్యసేవలను మెరుగైన రీతిలో అందించాలని సూచించారు. ఈ పర్యటనలో సర్వే విభాగం ఏడీ సూర్యారావు, ఆనందపురం తహశీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఎంపిడిఒ డాక్టర్ జానకి, సర్వే, వ్యవసాయ, రెవెన్యూ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

నేరాలు ఘోరాలు

డ్రెయినేజీలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న డ్రైనేజీలో సుమారు 45 నుండి 50 సంవత్సరాల మధ్య వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ అప్పలరాజు మాట్లాడుతూ నల్ల రంగు ఫుల్ ప్యాంటు, నల్ల రంగు ఫుల్ హాండ్స్ నిలువు గీతలు ఉన్న చొక్కా ధరించి ఉన్నాడని తెలిపారు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తించినట్లయితే తమకు నేరుగా సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రమాదవశాత్తు పడిపోయారా, లేక ఏదైనా సంఘటన జరిగిందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శారదా నదిలో మునిగి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-రాంబిల్లి : రాంబిల్లి మండలం కొత్తూరు వద్ద శారద నదిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు మునిగి ఐటిఐ విద్యార్థి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. రాంబిల్లి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... రావికవంతం మండలానికి చెందిన కొందరు వివాహం నిమిత్తం కొత్తూరు గ్రామానికి గురువారం వచ్చారు. వారిలో కొందరు స్నేహితులు గురువారం సాయంత్రం కొత్తూరు వద్ద శారదానదిలో స్నానానికి దిగారు. స్నానం చేస్తుండగా వారిలో సలాది మణికంఠ (18) అనే ఐటిఐ విద్యార్థి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. దీంతో తోటి స్నేహితులు స్థానికులకు తెలియజేయడంతో గాలించి మణికంఠ మృతదేహాన్ని బయటకు తీశారు. మణికంఠ విశాఖపట్నంలో ఐటిఐ చదువుతున్నాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేంద్ర తెలిపారు.

విద్యార్థినులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పినాకిల్ ఆసుపత్రి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ డెర్మటాలజిస్ట్ డాక్టర్ గోపీనాథ్ వైద్య పరీక్షలు చేసి, విద్యార్థినులకు పలు ఆరోగ్య పరమైన సూచనలు చేశారు. చర్మ సంబంధిత వ్యాధులను ముందుగా ఎలా గుర్తించవచ్చు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.జయప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశ గడువు పెంపు

ప్రజాశక్తి-మధురవాడ : స్థానిక మధురవాడ రిక్షాకాలనీలో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల ప్రతిభా పాఠశాల, కళాశాలలో (బాలికలు) 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించేందుకు గడువు పెంచినట్లు ప్రిన్సిపల్ శాంతికుమారి తెలిపారు. మార్చి 6వ తేదీ వరకు ఉన్న గడువును 13వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు https://apbragcet.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఎంక్వయిరీ ఆఫీసర్‌కు రికార్డులను అందజేస్తున్న నాయకులు, హెచ్‌ఆర్ మేనేజర్ చంద్రశేఖర్

పిఎఫ్ ఆఫీసుకు రికార్డులు అందజేత

ప్రజాశక్తి -గాజువాక : భెల్ హెచ్‌పివిపికి సంబంధించిన రికార్డులను శుక్రవారం పిఎఫ్ ఎంక్వైరీ ఆఫీసర్ శేషగిరిరావుకు అందజేసినట్లు గుర్తింపు యూనియన్ నాయకులు కొల్లి దేవుడు, బోండా బాబూరావు తెలిపారు. ఈ యూనిట్‌లో పిఎఫ్ విషయంలో కార్మిక, ఉద్యోగుల సర్వీసు 1992వ సంవత్సరానికి బదులు 1997 పడిందని, మరికొంతమందికి 2011వ సంవత్సరం పడిందని వివరించారు. ఇలా చాలా తప్పులు ఉన్నాయని తెలిపారు. క్యాంటీన్ నుండి పర్మినెంట్ అయిన ఉద్యోగులు పిఎఫ్ సర్వీస్ విషయంలో ఉన్న లోటుపాట్లు తదితరాలపై పిఎఫ్ యాజమాన్యంతో కంపెనీ ఉన్నత యాజమాన్యం, గుర్తింపు యూనియన్ పలు దఫాలు చర్చలు జరిపాయని తెలిపారు. చర్చల్లో పిఎఫ్ అధికారులు అడిగిన రికార్డులను ఇప్పుడు అందజేసినట్లు వివరించారు. శేషగిరిరావును కలిసిన వారిలో ఉన్నత యాజమాన్యం నుంచి హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ జి.చంద్రశేఖర్, గుర్తింపు యూనియన్ నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో తప్పులు సరిచేయాలి

యుటిఎఫ్

డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉపాధ్యాయుల సీనియారిటీ డ్రాఫ్ట్ జాబితాలో దొర్లిన తప్పులను సరిచేయాలని యుటిఎఫ్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్‌కు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ ఆధ్వర్యాన నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నబ్బాయ్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల ర్యాంకులు రోస్టర్ కమ్ మెరిట్ లిస్టులు ప్రకటించక పోవడంతో సీనియారిటీ డ్రాఫ్ట్ జాబితాలో అనేక పొరపాట్లు దొర్లినట్లు తెలిపారు. 1994 నుంచి ఇప్పటి వరకు జరిగిన డిఎస్‌సిల వారిగా ర్యాంకులను డిఇఒ వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలని కోరారు. ఉపాధ్యాయులు అప్పీలు ఇచ్చుటకు నూతన జిల్లాల్లో కూడా కౌంటర్ చేయాలన్నారు. పాడేరు, అనకాపల్లి జిల్లాల నుంచి టీచర్లు వైజాగ్ వచ్చి తప్పుల సవరణ కోసం అప్లై చేసుకోవడం చాల శ్రమతో కూడుకుంటుందని, సీనియారిటీ జాబితాలో ఉన్న తప్పులను సవరించుటకు ఉమ్మడి జిల్లాల్లో అందరి డిడిఒలకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని డిఇఒ హామీ ఇచ్చినట్టు యుటిఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, కార్యదర్శులు ఎన్.శేషుకుమార్, వి.చైతన్య, లీల తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా తదితరులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -యంత్రాంగం : జివిఎంసి 5వ వార్డులో రూ.3.66 కోట్లతో అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలతతో కలిసి శుక్రవారం పరదేశిపాలెం, కొమ్మాది జంక్షన్, వికలాంగుల కాలనీల్లో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ, ప్రతి వార్డులలో మౌలిక వసతుల కల్పన, రోడ్లు, సిసి.రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్పొరేటర్ మొల్లి హేమలత మాట్లాడుతూ, వార్డులో మౌలిక వసతుల కల్పనకు సహకరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, కూటమి నాయకులు పిల్లా వెంకట్రావు, వాండ్రా అప్పలరాజు, బోయి శ్రీను, నమ్మి శ్రీను, నాగోతి వెంకట సత్యనారాయణ, దేవర శివ, ఈగల రవికుమార్, బోయ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి నాగేంద్ర కాలనీ నుండి సంతోష్ నగర్ వెళ్లే రహదారి పనులకు వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.19.85 లక్షలతో ఈ రోడ్డు పనులు ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు. త్వరతగతిన పనులు పూర్తిచేసి రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్డేటి విజయ్ కుమార్, ఎఆ వెంకటలక్ష్మి, మారాడా ప్రదీప్, జిఎం.నాయుడు, మల్ల శ్రీనివాసరావు, దాడి సురేష్, దాడి ఫణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత దంత వైద్యశిబిరం

ప్రజాశక్తి -మాధవధార : అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల ఆధ్వర్యాన శనివారం మాధవధారలోని మాధవ యువజన సమాజం ఆవరణలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో పళ్ల క్లీనింగ్, ఉచిత చెకప్, నోటి ఆరోగ్యంపై అవగాహన, పుచ్చిపళ్లకు సిమెంటు పెట్టడం, కదిలే పళ్ల తీసి మందులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని మాధవధార, మురళీనగర్, కళింగనగర్, అంబేద్కర్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యూనిక్ ఆసుపత్రిలో హెమటాలజీ కేంద్రం

ప్రజాశక్తి - ఆరిలోవ : సాధారణ, కేన్సర్, రక్త సంబంధిత వ్యాధులకు మెరుగైన చికిత్స అందించడానికి మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యాన ఆరిలోవ హెల్త్ సిటీలోని యూనిక్ ఆసుపత్రిలో హెమటాలజీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎపి, ఒడిశాలో ఎక్కడా ఇంతవరకు లేని ఈ ప్రత్యేక కేంద్రాన్ని భారతదేశంలో హెమటాలజీ పితామహుడుగా పేరుగాంచిన పద్మశ్రీ ప్రొఫెసర్ డాక్టర్ మామెన్ చాండీ, నిమ్స్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సదాశివుడుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మామెన్ చాండీ మాట్లాడుతూ, రక్త సంబంధిత వ్యాధులు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయన్నారు. ముఖ్యంగా సికిల్ సెల్, బీటా థాలసేమియా, లుకేమియా వంటి వ్యాధులకు తీవ్రంగా ప్రభావితులవుతున్నారని తెలిపారు. వీటికి ఈ కేంద్రం సేవలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎంతో ఖర్చుతో కూడిన ఈ వైద్యం విశాఖలోనే మహాత్మాగాంధీ కేన్సర్ ఇనిస్టిట్యూట్ ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. నిమ్స్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సదా శివుడు మాట్లాడుతూ, ఈ విభాగం చాలా మంది పేద రోగులకు అందుబాటులో ఉంటుందన్నారు. సేవా దృక్పథంతో ప్రారంభించిన ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మురళీ కృష్ణకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్టాలిన్, వైద్య బృందం పాల్గొన్నారు.

హెమటాలజీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మామెన్ చాండీ

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు నిడిగట్టు వృద్ధాశ్రమంలో వృద్ధులకు టిడిపి నాయకులు పిట్ట సురేష్, వానపల్లి సత్య శుక్రవారం పండ్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గిడుతూరి శ్రీనివాసరావు, డి.అప్పలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ప్రభుత్వ గుర్తింపు కార్డు

కూలీలకు గుర్తింపు కార్డులిస్తున్న భీమిలి లేబర్ ఆఫీసర్

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభం గ్రామంలో శుక్రవారం భీమిలి కార్మిక శాఖ నుండి ప్రతిరోజు కూలి పనులు చేసుకున్న కూలీలకు గుర్తింపు కార్డులు అందజేయనున్నట్లు లేబర్ అసిస్టెంట్ బికె.నాయుడు తెలిపారు. ఈ గుర్తింపు కార్డు పొందిన వారికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా, ప్రమాద బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. ఉపాధి లేనప్పుడు 16 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉన్న వారికి ఆర్థిక సాయం కింద రూ.వెయ్యి, 60 సంవత్సరాలు దాటిన వారికి రూ.3 వేలు ప్రభుత్వమే బ్యాంకు ఖాతాల ద్వారా అందజేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయ స్థాయి అవార్డులకు ఐడియల్ స్కూల్ విద్యార్థులు ఎంపిక

యువపావని

హేమంత్ కుమార్

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక 68వ వార్డు పరిధిలోని మింది ఐడియల్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న వాసంశెట్టి యువపావని, 7వ తరగతి చదువుతున్న కోరుకొండ హేమంత్ కుమార్ ప్రతిపాదించిన సైన్స్ ప్రాజెక్టులు జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మైనాక్ సైన్స్ అవార్డులకు ఎంపికయ్యాయని పాఠశాల కరస్పాండెంట్ అలజంగి ఉదయ్‌కుమార్ తెలిపారు. వాసంశెట్టి యువపావని ప్లాస్టిక్ వ్యర్థాలతో మౌల్డింగ్ ఇటుకలు తయారు చేసి గృహ నిర్మాణానికి వాడే విధానాన్ని యువ పావని రూపొందించినట్లు తెలిపారు. ఈ ఇటుకలు చాలా తేలికగా ఉండటమే కాకుండా, అధిక మన్నికతో ఉండటంతో ఈ ప్రాజెక్ట్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాటి నివారణకు హేమంత్ కుమార్ సెన్సార్ సిస్టం తయారు చేశాడని తెలిపారు. రైల్వే ట్రాక్‌పై సెన్సార్లు అమర్చడం వల్ల 5 కిలోమీటర్ల దూరంలో ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు ఎదురెదురుగా ప్రయాణిస్తే రెండు ట్రైన్ల లోకోపైలట్లకు ప్రమాద సూచికగా సైరన్ మోగుతుందని వివరించారు. వారు వెంటనే బండి ఆపి ప్రమాదాన్ని నివారించడంతోపాటు ఆస్తి, ప్రాణ నష్టం అరికట్టవచ్చని తెలిపారు.

భద్రతా వారోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ (ఎన్ఐఎఫ్ఎస్) ఆధ్వర్యాన భద్రతా వారోత్సవం ఘనంగా నిర్వహించారు. సేఫ్టీ అండ్ వెల్ బీయింగ్ క్రూసియల్ ఫర్ వికసిత్ భారత్ అనే ఇతివృత్తంతో భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో భాగంగా రోడ్డు భద్రతా అవగాహన బైక్ ర్యాలీ, ఉచిత ఐ చెక్ అప్, ఫైర్ ఫైటింగ్ ప్రదర్శన చేపట్టారు. విద్యార్థుల కోసం సేఫ్టీ క్విజ్, వ్యాసరచన, ప్రసంగం (ఎలోక్యూషన్), అంతర్గత, బహిరంగ క్రీడలు వంటి పోటీలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎన్ఐఎఫ్ఎస్ సిఇఒ కుసుమకుమారి మాట్లాడుతూ, ఊహించని అగ్ని ప్రమాదాలకు ఎలా స్పందించాలి, ప్రథమ చికిత్స ఎలా అందించాలి అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని తమ కార్యాలయం వద్ద నిర్వహించినట్లు ఆమె తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను పాటించి, ప్రమాదాలను నివారించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

గాజువాక జంక్షన్లలో సబ్‌వే ఏర్పాటుచేయాలి

వార్నా, నివాస్ ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : పాత గాజువాక, కొత్తగాజువాక జంక్షన్లలో సబ్‌వే ఏర్పాటుచేయాలని వార్నా, నివాస్ నాయకులు డిమాండ్ చేశారు. పలు సమస్యలపై వార్నా నివాస్ ఆధ్వర్యాన గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వార్నా,నివాస్ ప్రధాన కార్యదర్శి కె.కిరీటం మాట్లాడుతూ, నూతన ఆస్తి పన్ను విధానం రద్దు చేయాలని, పాత విధానంలోనే పన్నులు ఉండేలా చూడాలని కోరారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలు, పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు తప్పనిసరి చేయటంతో ప్రజలపై అధిక భారాలు పడుతున్నాయని తెలిపారు. స్మార్ట్ మీటర్లు రద్దుచేయాలని, సద్దుబాటు ఛార్జీలు మాఫీచేయాలని డిమాండ్ చేశారు. గాజువాక హౌస్ కమిటీ పరిధిలో గృహ యజమానులు నిర్మాణం కోసం, ప్లాన్ కోసం గతంలో డబ్బులు చెల్లించారని, మరలా ప్లాన్ కోసం డబ్బులు చెల్లించాలని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. అధ్యక్షులు బి.త్రినాథస్వామి మాట్లాడుతూ, గంగవరం పోర్టు కాలుష్యంతో గాజువాక నియోజకవర్గ ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, దీని నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లో నిర్మించిన రైతు బజార్‌ను ప్రారంభించకపోవడం వల్ల ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని ఆవేదన వ్యక్తంచేశారు. తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు జె.రామన్న మాట్లాడుతూ, తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌కు కుంచుమాంబ కాలనీ నుంచి అప్రోచ్ రోడ్డు ఏర్పాటుచేసి, ఇరువక్కల మురుగు కాలువలు నిర్మించాలని కోరారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు ఎస్‌వికె.పరుశురామ్ మాట్లాడుతూ, పాత, కొత్త గాజువాక జంక్షన్లలో ఉన్న బస్టాపుల్లో షెల్టర్లు నిర్మించాలని కోరారు. ధర్నా అనంతరం జోనల్ కమిషనర్ బి.శేషాద్రికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాలో తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం వెంకటేశ్వరరావు, మత్స్యరాజు, అసోసియేషన్ నాయకులు సెగటపు గురునాథరావు, వర్రి వెంకట్రావు, పాలూరు లక్ష్మణస్వామి, పివివి.రమణారావు, బంగారునాయుడు, కె.సంతోషం, బి.శ్రీనివాసరావు, బి.అప్పారావు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న వార్నా, నివాస్ నాయకులు

ముగిసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి రవినగర్ శేషాద్రికొండపై ఉన్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి 25వ వార్షికోత్సవం శుక్రవారం ముగిసింది. శుక్రవారం ఉదయం హోమం, పంచామృతాభిషేకం నిర్వహించారు.

అన్ని రంగాలలో మహిళలు రాణింపు

ఆర్ఐ కుదర కోమలి

ప్రజాశక్తి- విశాఖపట్నం : అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్నారని, వారికి మరింత ప్రోత్సాహం దక్కితే సమాజాభివృద్ధి పరుగులు పెడుతుందని గోపాలపట్నం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కుదర కోమలి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆమె మాట్లాడుతూ విశాఖపట్నంలో తాను పుట్టి పెరిగానని, ఇక్కడే చదువుకొని, ఇక్కడే ఉద్యోగం చేయడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. 2016 నుంచి 2021 వరకు విశాఖపట్నం కలెక్టర్ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా, 2022 నుంచి 2024వరకు కంచరపాలెం రైతు బజార్ వెనుక ఉన్న సివిల్ సప్లై కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేశానని తెలిపారు. 2024 అక్టోబర్‌లో గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నానని వివరించారు. మహిళలు తమ ఉనికిని చాటుకునే విధంగా ప్రతి రంగంలో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. మహిళలు ధైర్యసాహసాలతో ముందుకు అడుగు వేస్తూ మరింత అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా మహిళలు ఉన్నత ఉద్యోగాలలో ఉన్నారని గుర్తు చేశారు. అవినీతి రహితంగా, న్యాయబద్ధంగా, ప్రజలకు మంచి సేవను అందించటం తమ వృత్తి ధర్మం అని చెప్పారు.

కీటక జనిత వ్యాధుల నియంత్రణకు శిక్షణ

ప్రజాశక్తి-సీతమ్మధార : జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణపై ఒకరోజు పునః శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారులకు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు శుక్రవారం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అదనపు సంచాలకులు డాక్టర్ బి.సుబ్రమణ్యేశ్వరి మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరూ ప్రతీ శుక్రవారం డ్రైడే ఫ్రై డే పాటించాలని, యాంటి లార్వా పద్ధతులు ద్వారా దోమల నిర్మూలన, పరిసరాల పరిశుభ్రత పాటించడం తదితర విషయాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. జోనల్ మలేరియా అధికారి డాక్టర్ పి.శాంతిప్రభ మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసి మాట్లాడుతూ, జిల్లాలో అమలు పరుస్తున్న యాంటి లార్వా పద్ధతులను వివరించారు.

పలు చోట్ల మహిళా దినోత్సవం

ఎపిఇపిడిసిఎల్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో సిఎండి పృథ్వీతేజ్

ప్రజాశక్తి -యంత్రాంగం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

భీమునిపట్నం : జివిఎంసి బ్యాంక్ కాలనీలోని సాగర వికాస సహకార పొదుపు సంఘం కార్యాలయంలో శుక్ర వారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి శ్రీదేవి, ఎంఇఒ-1 ఎం.శివరాణి, రాయిపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జయంతి రాధాకుమారి, కెజిబివి ప్రిన్సిపల్ గంగాకుమారి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మజ్జి పేట జెడ్పీ హైస్కూల్‌లో మ్యాజిక్ బస్ ఆధ్వర్యాన మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు బాలాజీ, నారాయణరావు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ ఆధ్వర్యాన మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సర్పంచులను ఎంపిటిసి సభ్యులను, మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, రాజేశ్వరి, ఐఎపిఆర్‌డి మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం జంక్షన్‌లో శుక్రవారం స్వతంత్ర సమరయోధులు, రూపాకుల విజయలక్ష్మి ట్రస్ట్ ఆధ్వర్యాన మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం ఎంపిటిసి కె.లక్ష్మీనాయుడు, సర్పంచ్ టి.పాప తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో ఉమెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు.

మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యాన మహిళాదినోత్సవం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, నాయకత్వ స్థానంలో మహిళలను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ కె.విజయలక్ష్మిని గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎమ్.శ్రీభరత్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డిసౌజా పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని గంభీరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఝాన్సీ లక్ష్మీబాయి, సరోజినీ నాయుడు, హ్యూమన్ కంప్యూటర్ శకుంతల దేవి, ఒలింపిక్స్‌లో బాక్సింగ్‌లో కాంస్యం సంపాదించిన మేరీ కోమ్, స్పేస్ లోకి వెళ్లిన మొదటి మహిళ కల్పనా చావ్లా, కూచిపూడి భరతనాట్యం కళాకారిణి యామిని కృష్ణమూర్తి తదితరుల వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

మండలంలోని శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటి ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యాన మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చోడవరం సబ్-రిజిస్ట్రార్ బి.గీతలక్ష్మి హాజరయ్యారు. గీతలక్ష్మిని కళాశాల యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎన్.ప్రసాదరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్, సిఎంఒ డాక్టర్ పిఎస్.రాజు పాల్గొన్నారు.

సీతమ్మధార: ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థలో అగ్రభాగాన నిలిచిన ఆపరేషన్స్ డైరెక్టర్ వి.విజయలలిత, సిజిఎంలు డి.సుమన్‌కల్యాణి, బి.సులేఖరాణి, జిఎంలు ఎన్.పార్వతి, ఎం.విజయచాముండి, పి.శ్రీదేవిలను సిఎమ్‌డి పృథ్వీతేజ్, డైరెక్టర్లు సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డి.చంద్రం, బి.రామచంద్రప్రసాద్, వి.విజయలలిత, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కెవి.రామకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ చింతకాయల పద్మావతి హాజరై మాట్లాడారు. నేడు స్త్రీలు అన్ని రంగాల్లో ముందు న్నారన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ పి.వందన, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.ఎస్. కృష్ణ మాట్లాడారు. ఆటల, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మాడుగుల : పట్టణ జనసేన పార్టీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి బండారు అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు అధ్యక్షత నిర్వహించగా మెడికల్ ఆఫీసర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ, మహిళలు విద్య, ఉద్యోగ,వ్యాపార రంగాల్లో ముందుండాలన్నారు. మాజీ జెడ్పిటిసి పుప్పాల సరోజిని, వడ్డాది వరలక్ష్మి, వీర సురేఖ, కరణం సూకరత్నం కళావతి, ఎంఈఓ బి దేవుడమ్మ, సిడిపిఒ సిహెచ్ శ్రీదేవి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లేశ్వరి దేవి, ఏపీఎం సిహెచ్ అప్పల నరసమ్మలు, జనసేన ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి రోబ్బా మహేష్ మహిళలను సత్కరించారు.

నక్కపల్లి:మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ప్రత్యేక అధికారి షేక్ షాలీమా అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత ఆధ్వర్యంలో విద్యార్థులతో 2 కే మారథాన్ నిర్వహించారు. ప్రత్యేక అధికారి షేక్ షాలీమా జెండా ఊపి ప్రారంభించారు.

గొలుగొండ:చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి షియాజ్ ఖాన్ అన్నారు. ఏఎల్.పురం హైస్కూల్లో పోక్సో, ఇతర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీసీ పోతిరెడ్డి శ్రీనివాసరావు, రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ వై.తారకేశ్వరరావు, ఎంఇఒ మూర్తి, హెచ్ఎం నాగభూషణం, సిడిపిఒ శ్రీగౌరి పాల్గొన్నారు.

మహిళా హక్కులు, బాలికల రక్షణకు ఉద్యమించాలి

సిఐటియు, ఐద్వా, యుటిఎఫ్ ఆధ్వర్యాన మహిళల ర్యాలీ

అనకాపల్లిలో ఐద్వా, యుటిఎఫ్, సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ప్రజాశక్తి-అనకాపల్లి

మహిళల హక్కులు, బాలికల రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా, సిఐటియు, యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సిఐటియు, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, యుటిఎఫ్ ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రదర్శనకు ముందు భాగంలో మహిళలు లాయరు, డాక్టరు, పోలీసు, రాజకీయ నాయకులు, కార్మికులు వంటి వేషధారణతో ముందుండి నడిచారు. 'మహిళలను గౌరవించాలి', 'బాలికలను బతకనిద్దాం, ఎదగనిద్దాం', 'మహిళలపై హింస అరికట్టాలి' 'స్కీం వర్కర్లకు వేతనాలు పెంచాలి' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళల హక్కులను అణిచివేస్తున్నారని, వేధింపులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి వరలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం విధానాల వల్ల మహిళలపై దాడులు పెరిగాయని, అత్యాచారాలు, వేధింపులు నిత్యకృత్యమయ్యాయని పేర్కొన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ ఒకనాడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, కాని నేడు బిజెపి ప్రభుత్వం మహిళలను మళ్లీ వంటింటికే పరిమితం చేయాలని చూస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మి, విజయలక్ష్మి, సాయి(అంగన్వాడీ యూనియన్), కె.శాంతి, రమణమ్మ (ఆశా యూనియన్), హైమావతి ఆశ(యూటీఎఫ్), జి.సుభాషిని, మంగతాయారు, వాణిశ్రీ, అరుణ, దేవి, నీరజ (ఐద్వా) గంటా శ్రీరామ్, పరమేశ్వరరావు, భవాని, అజయ్, రాము(సిఐటియు), గండి నాయనబాబు (రైతు సంఘం) తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : ఐద్వా ఆధ్వర్యంలో మండలంలోని గొర్రివానిపాలెం బసవతారకరామ నగర్‌లో శుక్రవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలకు ఎన్ని చట్టాలు ఉన్నా వారికి రక్షణ లేక హింసలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం మాట్లాడుతూ సమాన హక్కులు సాధించటానికి ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఎం.బంగారమ్మ, డి.లక్ష్మి, టి అన్నపూర్ణ, ఆర్.ఇందుమతి, కె.అరుణ, ఎం సంతోషి, యు రాణి, హైమా, ఆర్ సీతామహాలక్ష్మి, టి.సూరమ్మ, బి బృంద, కే మంగ, బి సీతమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : పోరాటాల ద్వారానే మహిళా హక్కులు సాధించుకోవచ్చని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల కార్యదర్శి కె సోమునాయుడు , ఐద్వా మండల కన్వీనర్ ఆర్.లక్ష్మి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా అచ్యుతాపురంలో శుక్రవారం మహిళలు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళలు సత్యవతి, కాసులమ్మ, మంగమ్మ, వెంకటలక్ష్మి, విజయ, బంగారమ్మ, గంటాలమ్మ పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ఆధ్వర్యాన..

అనకాపల్లి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపి మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బూసి పరమేశ్వరి జిల్లా కేంద్రంలో పతాకావిష్కరణ చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందేళ్లుగా మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులను సనాతన ధర్మం పేరుతో కాలరాసే కుట్ర జరుగుతోందని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుబ్బలక్ష్మి, పి నారాయణమ్మ, జి లక్ష్మి, తులసి, కే లక్ష్మి, సరస్వతి, కే వర పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : మహిళా దినోత్సవం స్ఫూర్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని ఏపి మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'గౌరవప్రదమైన జీవితం దాతృత్వం కాదు. అది మన హక్కు' అన్న నినాదంతో శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహిళా సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సమితి జిల్లా కార్యదర్శి ఎం.ఎ.బేగం, జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన

బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పిఇసిహెచ్.వి.సాగర్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలు, లైంగిక వేధింపులు, అవమానాలను నిరోధించాలని కోరారు. దేశంలో మహిళలకు భద్రత కొరవడటంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో యూనియన్ మహిళా విభాగం కార్యదర్శి మీనా కుమారి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

అనకాపల్లిలో మహిళా సమాఖ్య ఆధ్వర్యాన..



వెటరన్ అథ్లెట్ ముత్యం లక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

డిగ్రీ కళాశాలలో మాతృ వందనం

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్ కమిటీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మాతృ వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో మొదటి స్థానం పొందిన విద్యార్థినులు నిహారిక, హాని, గాయత్రి, యమునా, ఉషా తల్లులు శ్రీదేవి, రాజ్యలక్ష్మి, సీనమ్మ, నాగమణి, సత్యవతిలను ఘనంగా సన్మానించారు. అనంతరం చోడవరం మహిళా వెటరన్ అథ్లెట్ ముత్యం లక్ష్మీ, మహిళా అధ్యాపకులను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ విముక్తి సంఘటన కార్యదర్శి లక్ష్మీ కుమారి, డబ్యుఇసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మి మంగమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అందించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గ్రామీణ మహిళలకు అందించినప్పుడే మహిళలకు నిజమైన స్వాతంత్ర్యం లభిస్తుందని స్థానిక ఎంపిడిఓ పి.పద్మజ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలకు ప్రభుత్వాలు స్వేచ్ఛను స్వాతంత్ర్యాన్ని కొంతమేరకు అందిస్తున్నప్పటికీ మారుమూల గ్రామాలలో మహిళలకు ఇంకా దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మహిళలు చదువుకొని విద్యావంతులు అయినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలు వారి అభిప్రాయాలను పూర్తిస్థాయిలో తెలియజేసే స్వాతంత్ర్యాన్ని అందించాలన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, నేరాల నిరోధనకు ప్రభుత్వాలు మరింత కట్టుదిట్టమైన చట్టాలను అమలు చేయాల్సి ఉందని చెప్పారు.

ఎంపిడిఓ పద్మజ

గురుకులంలో టెన్త్ విద్యార్థులకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ కార్యక్రమం శుక్రవారం విద్యార్థుల కేరింతల మధ్య ఘనంగా జరిగింది. విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎపియుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, జిల్లా ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఏ.శ్రీధర్ రెడ్డి, జిల్లా సార్వత్రిక విద్యాపీఠం ఇన్చార్జ్ కృష్ణంరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు బిఎస్ఎంకె.జోగి నాయుడు, బొడ్డేడ మురళి, బొడ్డేడ శ్రీను, గొర్లె నాయుడు, తల్లిదండ్రుల కమిటీ వ్యవస్థాపక చైర్మన్ కర్రి గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిఎం ఇంటర్న్‌షిప్ దరఖాస్తుకు తుది గడువు 12

ప్రజాశక్తి-అనకాపల్లి : పిఎం ఇంటర్న్ షిప్ -2025 దరఖాస్తుకు ఈనెల 12 ఆఖరు తేదీ అని, pmintenship.mca.gov.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఇన్చార్జ్ జిల్లా కార్మిక శాఖ అధికారి కే వసంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదిపాటు శిక్షణ ఇచ్చినా అనంతరం సర్టిఫికెట్, ఉపాధి అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణకాలంలో నెలకు 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు చెప్పారు. 21 నుంచి 24 సంవత్సరాల వయసు కలిగి ఇంటర్మీడియట్, ఐటిఐ, పాలిటెక్నిక్, బిటెక్ ఉత్తీర్ణులైన వారు దీనికి అర్హులని పేర్కొన్నారు.

పిల్లలను లైంగికంగా వేధిస్తే జీవిత ఖైదు

ప్రజాశక్తి-యలమంచిలి : పిల్లలను లైంగికంగా వేధించడం మహానేరమని, అందుకు పాల్పడిన వారికి జీవిత ఖైదు విధిస్తామని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ ఆవరణలో శుక్రవారం జరిగిన పోక్సో చట్టం న్యాయ శాస్త్ర అవగాహన శిబిరంలో ఆమె మాట్లాడుతూ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో) చట్టం ప్రకారం ఆడ, మగ మైనర్ పిల్లల పట్ల లైంగికంగా ఎవరు ఏవిధంగా వేధించినా 3 ఏళ్ల నుండి 10 ఏళ్ల వరకూ జైలు శిక్ష పడుతుందని వివరించారు. అశ్లీల చిత్రాల ప్రదర్శన, లైంగిక హింస, లైంగిక దాడి, హెరాస్‌మెంట్ కేసుల్లో 3 ఏళ్ల జైలు శిక్ష పడుతుందని చెప్పారు. బలవంతంగా లైంగిక చర్యలు, కిడ్నాప్ కేసుల్లో 3 నుండి 5 ఏళ్ల జైలు శిక్ష విధిస్తామన్నారు. పైస్థాయి వ్యక్తులు మైనర్లను లైంగికగా వేధిస్తే, అత్యాచారం లాంటి వాటికి పాల్పడితే జీవిత ఖైదు శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ధూళి నూకరాజు, లోక్ అదాలత్ మెంబర్ పివి.రమణ, ఎజిపి ద్వారపూడి వెంకట్రావు, మెస్మా ప్రతినిధి పద్మావతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, టిపిఓ శ్రీలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు,

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పునకు పంచాయతీ తీర్మానం

- ప్రజాశక్తి కథనానికి స్పందించిన అధికారులు, పాలకవర్గం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలం పి బోనంగి పంచాయితీ శివారు విఎల్ఎన్ పురం (కొత్తూరు) జాజులు వానిపాలెం నుండి కలపాక వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఎంపీపీ స్కూల్ దగ్గర ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను మార్చాలని ఆ పంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ శిథిలావస్థకు చేరడంతో ఫిబ్రవరి 20న ప్రజాశక్తిలో 'ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్' శీర్షికను ప్రజాశక్తిలో కథనం ప్రచురించడం జరిగింది. ప్రధాన రహదారిని ఆనుకొని నూతనంగా నిర్మిస్తున్న కాలువ నిర్మాణానికి ఇది అడ్డంగా మారిందని ప్రజాశక్తి కథనంలో పేర్కొంది. దీనికి పంచాయతీ పాలక వర్గం, అధికారులు స్పందించారు. దీనిని మార్చడానికి అయ్యే ఖర్చును గ్రామపంచాయతీ సాధారణ నిధుల నుండి భరించాలని నిర్ణయించినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు కసింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు తమ నివేదికను ఇచ్చి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ మార్పునకు అంచనా విలువ వేయవలసిందిగా కోరడమైనదని చెప్పారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలపై 12న చలో విజయవాడను జయప్రదం చేయండి

ఎపి వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బకాయిలు, వేసవి, పనిముట్ల అలవెన్సులు, పే స్లిప్పులు తదితర సమస్యలపై ఈనెల 12న జరుగు ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవన్‌లో శుక్రవారం సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు యం. సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు పనులు లేక, ఉపాధి హామీ పనులు సరిపడక, వేలాది మంది ఇతర ప్రాంతాలకు నెలలు తరబడి వలసలు పోతున్నారని తెలిపారు. ఈ క్రమంలో ప్రమాదంలో ప్రతి నిత్యం పదుల సంఖ్యలో కూలీలు చని పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి పిల్లలు చదువులు కోల్పోయి, వారి భవిష్యత్తు మొగ్గలోనే తుంచివేయబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండకాలంలో నేల గట్టిగా మారి కూలి గిట్టుబాటు కావడం లేదన్నారు. గతంలో ఇస్తున్న సౌకర్యాలు ఆపేశారని, రాజకీయ జోక్యం పెరిగి కూలీలకు మస్టర్లు ఇవ్వకుండా, రాజకీయ పార్టీ నాయకులకు మస్టర్లు ఇచ్చి పేదల డబ్బులు కాజేస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యలపై మార్చి 12న విజయవాడ ధర్నా చౌక్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని, సమ్మర్ అలవెన్స్ 30శాతం కలపాలని, పనిముట్లు, మంచినీళ్లకు రూ.5 చొప్పున అలవెన్స్ ఇవ్వాలని, ప్రతివారం పే స్లిప్పు ఇవ్వాలని కోరారు. ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలకు బీమా రూ.25 లక్షలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కె భవాని, ఇరట నరసింహమూర్తి, బిటి దొర, సాంభశివరావు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సిడిపిఒ, సూపర్ వైజర్‌ను సస్పెండ్ చేయాలని ధర్నా

ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : అంగన్వాడీ కార్యకర్త రొంగలి నూకరత్నం ఆత్మహత్య ప్రయత్నానికి కారకులైన ఐసిడిఎస్ సిడిపిఒ, మంగతాయారు, సూపర్వైజర్ రాములమ్మలను వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం సిఐటియు ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి ఈ.నాయుడుబాబు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్త విధులు సక్రమంగా నిర్వహించుకుంటే కాగితం మూలంగా నోటీసు ఇచ్చి తప్పులు సరిదిద్దుకోవాలని, వారి మాట వినకపోతే శాఖ పరంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అంతేతప్ప వ్యక్తిగత దూషణలకు వెళ్లడం, జీతాలు నిలుపుదల చేయడం సరికాదని పేర్కొన్నారు. నూకరత్నంను మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన సిడిపిఒ, సూపర్వైజర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు జి.కుమారి, పి భవాని, ప్రజాసంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు, అంగన్వాడీ ఆయాలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-అచ్యుతాపురం : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అచ్యుతాపురం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ఎంపిడివో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కార్యదర్శి కె సోమినాయుడు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు 25 సంవత్సరాలు పైబడి ఎండకు ఎండి వానకు తడిచి పని చేస్తూ, చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పనికి తగ్గ వేతనం ఇవ్వటం లేదని, ప్రభుత్వం వారి చేత వెట్టి చాకిరి చేయించుకుంటుందని విమర్శించారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడడానికి వారి జీవితాలను పణంగా పెట్టి పనిచేస్తున్నారన్నారు. పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.15 వేలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ, సెలవులు వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పనిలో ప్రమాదాలు జరిగితే వైద్య సేవలు అందించాలని, గ్లౌజులు, బూట్లు మాస్కులు, నూనె, సబ్బులు, పనిముట్లు నాణ్యమైనవి సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కన్వీనర్ ఆడారి నాగేశ్వరరావు, నాయకులు నాగమణి, శ్రీరాములు, రమణ, జ్యోతి, కళ్యాణి, పలు పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు


ఆలయం వార్షికోత్సవంలో పాల్గొన్న టిడిపి నేత అప్పలనాయుడు

అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఈ.బోనంగి పంచాయతీ పరిధి బొద్దపువానిపాలెం గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం 10వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, జనసేన మండలం అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు అట్ట సన్యాసి అప్పారావు, బొద్దపు నూకరత్నం, టిఎన్‌టియుసి నాయకులు రొంగలి గోపాలకృష్ణ, స్థానిక నాయకులు మెడిశెట్టి అప్పారావు, మంత్రి గిరి ప్రసాద్, చందక గోవింద రావు, బొద్దపు రామకృష్ణ, మెడిశెట్టి బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గౌరీ గ్రంథాలయం 83వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీ శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రంథాలయంలో న్యూరో వ్యాధి (మెదడు, వెన్నుపాము, నరాలు)కు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు 'నేర్చుకోవడం- జ్ఞాపకశక్తి' అంశంగా అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ న్యూరో సర్జరీ వైద్య నిపుణులు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ న్యూరోసర్జరీ నేషనల్ ఇన్స్టిట్యూట్ మెంటల్ హెల్త్, న్యూరో సైన్సెస్ (నిమ్‌హాన్స్-బెంగుళూరు) పూర్వపు అధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ మళ్ల భాస్కరరావు హాజరవుతారని తెలిపారు. వివరాలకు 9247166511 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పారిశుధ్య సిబ్బందికి బకాయి జీతాలు విడుదల

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి అనకాపల్లి జోనల్ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆరు నెలల బకాయి జీతాలు విడుదలయ్యాయి. 9 నెలలు జీతాలు చెల్లించకపోవడంతో ఈ విషయమై కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్‌రావు దృష్టికి పారిశుధ్య కార్మికులు తీసుకువెళ్లారు. దీనిపై వారు స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఆరు నెలల జీతాలను వేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పారిశుధ్య సిబ్బంది కార్పొరేటర్ నీలిమ భాస్కర్ ఇంటి వద్ద సత్కరించారు.

డిజిపిని కలిసిన శ్రీనివాస్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : రాష్ట్ర డీజీపీ హరీష్ గుప్తాను మండలంలోని మల్లాం గ్రామ మాజీ సర్పంచ్, న్యాయవాది గొలగాని శ్రీనివాస్ శుక్రవారం అమరావతిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖలో మాదక ద్రవ్యాలు గంజాయిని అరికట్టాలని, మహిళలకు భద్రత కల్పించాలని డిజిపిని శ్రీనివాస్ కోరారు.

నేటి నుండి పి4 సర్వే

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఈ నెల 8 నుండి 18 వరకు పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్ (పి4) సర్వే చేపట్టనున్నట్లు ఎంపిడివో పి.పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 20 శాతం మంది పేదలను గుర్తించి వారి స్థితిగతులను మెరుగుపర్చే ఉద్దేశంతో ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాలలకు ఆట వస్తువుల వితరణ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని టి.శిరసపల్లి, రామారాయుడుపేట పాఠశాలలకు శిరసపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పొలమరశెట్టి చినప్పారావు కుమారుడు జగన్నాధ్ నాయుడు (ఎన్ఆర్ఐ) శుక్రవారం ఆట వస్తువులు వితరణ చేశారు. ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడిన నాయుడు తన తల్లి ఎల్లయ్యమ్మ జ్ఞాపకార్థం రూ.1,50,000 విలువచేసే రంగులరాట్నం, జారుడు బల్ల, స్వింగ్ ఉయ్యాల తదితర ఆట వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.శివ నాయుడు, హెచ్ఎం జి.మల్లేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ పలమరశెట్టి ఆనందరావు, సిఆర్ఎంటి మద్దాల గోవిందరావు, హెచ్ఎం మల్ల కోటేశ్వరరావు, వీఆర్వో పొలమరశెట్టి వీరప్పారావు, ఎల్లపు వీరయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రమణారావుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని అచ్చెర్ల గ్రామ టిడిపి అధ్యక్షులు నైనంశెట్టి రమణారావు తాళ్లపాలెంలో శుక్రవారం నూతన గృహ ప్రవేశం చేసిన నేపథ్యంలో ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఎపియుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ రమణారావు కుటుంబ సభ్యులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు అధికార రాష్ట్ర ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు, ఎన్‌టిఆర్ జిల్లా వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఉల్లింగల రమేష్, కూటమి నాయకులు అప్పికొండ అప్పారావు, కర్రి గోవింద, పుర్రె నర్సింగరావు, నక్క సాయి, జె.నూకి నాయడు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-కశింకోట : భూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మండల ప్రత్యేకాధికారి లక్ష్మీ సుభాని అన్నారు. కశింకోట మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మండల సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ వివాదాలు, భూ సమస్యలు తదితర అంశాలపై వచ్చే ఫిర్యాదులను పరిశీలించి ఇరువర్గాలకు న్యాయం చేయడం కోసం ఇటువంటి కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వంగలపూడి రవి కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కుమార్ స్వామి, ఎస్ఐ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని పెదనందిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవే అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో వేదిక జిల్లా ఉపాధ్యక్షులు కొరుప్రోలు శ్రీను, హెచ్ఎం డి.శ్రీనివాసరావు, మండల కార్యదర్శి గంగావంశం సంతోష్, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని ఆరిపాక జడ్పీ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు లక్ష్మీశెట్టి గోపినాథ్ కుమారుడు ఉదయ్ కుమార్ రెండో వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు ప్లాంక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఎస్ఎంసి చైర్మన్ మల్లయోగి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిబి ముక్తపై సమావేశం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలం తురకలపూడి పిహెచ్‌సి పరిధిలోని ఆర్.భీమవరం గ్రామాన్ని టిబి ముక్త పంచాయతీగా ఎంపికైన సందర్భంగా జిల్లా లెప్రసీ, క్షయ అధికారి డాక్టర్ ఎంఎస్‌వికె.బాలాజీ జిల్లా సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 24న కేంద్ర బృందం పర్యటించనున్న నేపథ్యంలో ముందుగా తగిన సూచనలను, సలహాలను సంబంధిత సిబ్బందికి తెలియజేశారు. వైద్యాధికారి డాక్టర్ డి.సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బాలాజీ మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన టిబి డే సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ అయ్యపు రెడ్డి, పెంటయ్య, కార్యదర్శి కె ప్రభాకర్, ఆరోగ్య విస్తరణ అధికారి కెవి. రాజశేఖర్, ఫార్మసీ అధికారి చంద్రమౌళి, సీతమ్మ పాల్గొన్నారు.

నూకాంబిక జాతర రాట మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి తాకాశి వీధిలో రెండు శతాబ్దాల చరిత్ర కల్గిన శ్రీనూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా శుక్రవారం రాట ముహూర్తం, వినాయకునికి బియ్యం కట్టుట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తాకాశి కన్నబాబు, ఆలయ ఈవో రాజ సులోచన, తాకాశి కొండల రావు, తాకాశి సూర్యారావు, బేతి ఈశ్వర రావు, బోయిన వరహాలు తాడి రామకృష్ణ, గంగుపోవు మహేష్ దొర, తాకాశి సత్యం దొర, తాకాశి నాగేష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించాలని నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న డంపింగ్ యార్డును తక్షణమే తరలించి ప్రజలకు మోక్షం కలిగించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు శుక్రవారం డంపింగ్ యార్డ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్షల ప్రజా ధనం దుర్వినియోగం చేస్తూ ఉమ్మ తడి పనులు చేయకుండా :శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నేతలు బొడ్డేడ అప్పారావు, చిన్ని యాదవ్, సూదికొండ మాణిక్యాలరావు, కొల్లు చిన్న అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు పాల్గొన్నారు.

'నియోజకవర్గంలో కూటమి కమిటీలు వేయలేదు'

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి నియోజకవర్గంలో కొంత మంది చెప్పుకుంటున్నట్టు కూటమి పార్టీలు కలిసి ఎటువంటి కమిటీలను వేయలేదని, దీనిని అధికారులు, పారిశ్రామిక వేత్తలు గ్రహించాలని ఎపిఎస్ఆర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిశ్రమల్లో పలుకుబడి, అధికార్ల దగ్గర మెప్పు పొందడానికి తెలుగుదేశం, జనసేన, బిజెపి కలిసి కమిటీలను నియమించిందని చెప్పుకోవడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులమని చెప్పుకుంటూ ఎవరైనా వస్తే వారి సమాచారం తెలపాలని కోరారు.

నాయీ బ్రాహ్మణుల హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : నాయీ బ్రాహ్మణులకు సెలూన్ షాపులకు 200 యూనిట్ల ఉచిత కరెంటుకు రూ.450 కోట్లు, ఆదరణ-3 పథకానికి రూ.1000 కోట్లు రాష్ట్ర బడ్జెట్లో కేటాయించడంపై జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం, జిల్లా వాయిద్య కళాకారుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు శుక్రవారం తమ్ము పాలలో ఆయా సంఘాల నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ పథకాలకు కృషి చేసిన టీటీడీ మండలి సభ్యులు వైద్యం శాంతారామ్, ఏపీ నాయీ బ్రాహ్మణ సంఘం చైర్మన్ రుద్రకోట సదాశివం, అనకాపల్లి జిల్లా కార్పొరేషన్ డైరెక్టర్ పులేటికుర్తి అప్పల రమేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కేసనకుర్తి అప్పారావు, కందికుప్ప గోవిందరావు, పేకేటి వరప్రసాద్, పేలూరి సత్యనారాయణ, గుడివాడ సూరిబాబు, పాల్గొన్నారు.

తనిఖీ చేపడుతున్న అధికారులు

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ శుక్రవారం ఎంపిడిఓ డి సీతారామరాజుతో కలిసి సందర్శించారు. మధ్యాహ్నం భోజనం తనిఖీ చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల గురించి ఆరా తీశారు. పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం వారపు సంతను పరిశీలించారు.మత్స్యకారులకు, వ్యాపారులకు మరింత సదుపాయం కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నానాజీ, జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, టిడిపి నాయకులు కొప్పిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు

చెక్కతో మహిళ ప్రతిబింబం

సూక్ష్మ కళాకారుని ప్రతిభ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన దార్ల రవి ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని తన సూక్ష్మకళను ప్రదర్శించాడు. చెక్కపై 8 అంకె రూపంలో మహిళా మూర్తిని ఆవిష్కరించాడు. తన సూక్ష్మ కళతో మహిళామూర్తులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశాడు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -కొత్తకోట:మేజర్ పంచాయితీ కొత్తకోట లో జిల్లా పరిషత్ నిధులతో సిసి మురుగు నీటి కాలవ నిర్మాణానికి శుక్రవారం గ్రామ సర్పంచ్ కొన లోవరాజు, ప్రోటోకాల్ జెడ్పిటిసి తలారి ఆదిమూర్తి తదితరులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లోవరాజు, వార్డు సభ్యులు గుమ్ముడు దొరబాబు మాట్లాడుతూ స్థానిక 4వ వార్డు గుమ్ముడు వీధి రామాలయం నుంచి నంది విగ్రహం వరకు సుమారు 5 లక్షల జిల్లా పరిషత్ నిధులు ఖర్చు తో సీసీ డ్రైన్ నిర్మిస్తున్నామన్నారు. గత కొంత కాలంగా డ్రైన్ పూడికపోయి వర్షం వస్తే నీరంతా రోడ్డు పైకి చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందన్నారు. ఈ సమస్య నివారణకు నిధులు మంజూరు కు కృషి చేసిన ప్రోటోకాల్ జడ్ పిటిసి ఆదిమూర్తి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవ, వైసీపీ ప్రధాన కార్యదర్శి శీలం శంకరరావు, మాజీ ఉప సర్పంచ్ గున్నాజీ, శీలం రాజేష్ పాల్గొన్నారు.

రెల్లిలకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 14న జరిగే జనసేన ఆవిర్భావ సభలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రెల్లిలకు ఒక ఎమ్మెల్సీ స్థానంతో పాటు రెల్లి కార్పొరేషన్ ప్రకటన చేయాలని రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు కోరారు. శుక్రవారం నర్సీపట్నం మండలం చెట్టుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్ కాకినాడ బహిరంగ సభలో అణిచివేతకు గురవుతున్న రెల్లిలకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జనసేన ఆవిర్భావ సభలో పవన్ కళ్యాణ్ రెల్లి కార్పొరేషన్ ప్రకటనతో పాటు ఎమ్మెల్సీ స్థానం కల్పించి మాట నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు భవిరిశెట్టి కన్నారావు, కుమార్, పి.మోహన్‌రావు, బెన్నీసులు, స్వామి పాల్గొన్నారు.

వెంకన్న కళ్యాణోత్సవాలకు పటిష్ట బందోబస్తు

- జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా

పరిశీలిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపమాక వెంకన్న వార్షిక తిరు కళ్యాణోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవాలు మార్చి 9వ తేదీ న అంకురార్పణతో ప్రారంభమై 17 వ తేదీతో ఉత్సవాలు ముగుస్తాయి. 10 వ తేదీన ధ్వజారోహణం, రథోత్సవం,కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా వెంకన్న ఆలయాన్ని సందర్శించారు. ఎస్.బి డిఎస్పీ బి.అప్పారావు, నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు, సిఐలు కుమారస్వామి, రామకృష్ణ, ఐటి కోర్ ఎస్ఐ సురేష్‌బాబులతో కలిసి కళ్యాణోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల రాకపోకలు, దర్శనాలు, స్వామివారి తిరువీధి సేవలు, రథోత్సవం, విఐపి దర్శనాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ, కళ్యాణోత్సవానికి తొమ్మిది రోజుల పాటు సుమారు లక్ష మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని, అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. 300 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు భద్రతను సెక్టార్లుగా విభజించి పర్యవేక్షించనున్నట్లు వివరించారు.

ఆలయానికి చేరిన బంగారు ఆభరణాలు

ప్రజాశక్తి నక్కపల్లి :ఉపమాక వెంకన్న కళ్యాణోత్సవాల సందర్భంగా స్వామివారి బంగారు ఆభరణాలను పటిష్ట భద్రత నడుమ ఆలయ అధికారులు విశాఖపట్నం ట్రెజరీ నుండి శుక్రవారం ఉపమాక ఆలయానికి తీసుకువచ్చారు. బంగారు ఆభరణాలను ఆలయంలో స్ట్రాంగ్ రూములో భద్రపరిచారు. ఆదివారం ఉత్సవాల ప్రారంభం రోజున ఆభరణాలను ఉత్సవమూర్తులకు అలంకరిస్తారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జగన్మోహన్ ఆచార్య, సూపరింటెండెంట్ రమణ, ఆలయ ఇన్స్పెక్టర్ కూర్మేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, శేషాచార్యులు, పాలకమండలి మాజీ చైర్మన్ లు కొప్పిశెట్టి కొండబాబు, పెంకుల రాజు పాల్గొన్నారు.

మత్స్యకారులపై కేసులు ఉపసంహరించుకోవాలి

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రాజయ్య పేటలో పేద మత్స్యకారులపై ఫారెస్ట్ అధికారులు పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద మత్స్యకారులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం తహసిల్దార్ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు, మండల కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ, రాజయ్య పేట గ్రామానికి చెందిన నిరుపేదలైన మత్స్యకారులు గత 25 సంవత్సరాలుగా సర్వే నెంబర్ 289లో చిన్న చిన్న కమ్మల పాకలు, గుడిసెలు, రేకులు షెడ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారన్నారు. వీరందరూ ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు, రేషన్, ఆధార్ కార్డు, ఓటు హక్కు కలిగి ఉన్నారని తెలియజేశారు. ఇటీవల ఫారెస్ట్ అధికారులు నివాస స్థలాలను ఖాళీ చేయాలని 16 మందిపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. ఎప్పటినుండో నివాసం ఉంటున్న పేదలపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మత్స్యకారుల పై సముద్ర తీరంలో నివశించవద్దని కేసు లు పెట్టడం ఎంత వరకు న్యాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోడా కాశీ రావు,కారే భూలోక, మైలపల్లి బాపూజీ, గోసేవ అంజి పాల్గొన్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపమాక వెంకన్న కళ్యాణోత్సవాల సందర్భంగా శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని డిపిఓ శిరీషా రాణి సూచించారు. ఎంపిడిఓ డి సీతారామరాజు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రీన్ అంబాసిడర్‌లు, పారిశుద్ధ్య కార్మికులతో నక్కపల్లి నుండి ఉపమాక వరకు దారి పొడవునా, ఆలయ పరిసర ప్రాంతాల్లోనూ ముమ్మరంగా శానిటేషన్ పనులు చేపట్టారు. చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. ఇన్చార్జి ఇ ఒపిఆర్డి ఎం శ్రీను, పలువురు పంచాయతీ కార్యదర్శులు శానిటేషన్ పనులు పర్యవేక్షించారు. ఈ మేరకు డిపిఓ శిరీషా రాణి శానిటేషన్ పనులను పరిశీలించారు. శానిటేషన్ పై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. వెంకన్న ఉత్సవాల సందర్భంగా ఐదు రోజులపాటు ఆలయ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. గ్రామాల్లో తడి పొడి చెత్తను సేకరించి, సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. 7 నెలల నుండి జీతాలు చెల్లించలేదని దోసలపాడు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు డిపిఓ దృష్టికి తీసుకువెళ్లారు. పలువురు గ్రీన్ అంబాసిడర్‌లకు ప్రతినెల జీతం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ లు కొప్పిశెట్టి కొండబాబు, సిహెచ్ రామ సూర్యనారాయణ రాజు, టిడిపి నాయకులు శ్రీను, వాసు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి గుర్తింపు

-ప్రజాశక్తి కథనానికి స్పందన

సర్వే చేపడుతున్న అధికారులు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో లింగాపురం గ్రామంలో ప్రధాన రహదారిని అనుకుని ఆక్రమణకు గురైన పట్టించుకోరా అంటూ ప్రజాశక్తిలోవచ్చిన వార్త పై రెవెన్యూ అధికారులు స్పందించారు. సర్వే నెంబరు73-2 9సెంట్లు కాగా 73 -1 వెరసి 40 సెంట్లు ప్రభుత్వ భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సదరు భూమి ఆక్రమణ కాదని కేవలం అనుభవంలో మాత్రమే ఉందంటూ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. సదరు భూమిపై సాగు చేసుకున్న రైతును విచారణ చేపట్టినట్లు ఆర్ఐ వర్ధవరావు తెలిపారు. ఆక్రమిత ఆసామి హైకోర్టులో దావా నడుస్తున్నట్లు సైతం అధికారులు వెల్లడించారు.

నాటుసారాతో జీవితాలు నాశనం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్.పురంలో శుక్రవారం నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గొలుగొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ వీ.రామకృష్ణ మాట్లాడుతూ నాటుసారాకు దూరంగా ఉండాలన్నారు. నాటుసారాతో జీవితాలు నాశనం అవుతాయని చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా నాటుసారా అమ్మినా, తయారు చేసిన తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ రహీమ్, సర్పంచ్ లోచల సుజాత, మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, ఎక్సైజ్ సిబ్బంది కె.చిన్నయ్య, రంజిత్ కుమార్, దేముడు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన నమూనా పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుక్రవారం నర్సీపట్నం జడ్పీ బాలికల హైస్కూల్‌లో బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రైనీ డీఎస్పీ చైతన్య మాట్లాడుతూ, విద్య అనేది ప్రస్తుతం బట్టి చదువులకు మాత్రమే పరిమితం అయిపోతుందని ఈ పద్ధతి మంచిది కాదన్నారు. ప్రతి విద్యార్థి మేధాశక్తిని పెంచుకునే విధంగా విద్య ఉండాలని చెప్పారు. మండల విద్యాశాఖ అధికారి తలుపులు మాట్లాడుతూ, విద్యార్థులు పరీక్షలు బాగా రాసి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఎస్సై రమేష్, హెచ్ఎం మాధవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బాబ్జి, జి.ఫణీంద్ర కుమార్, నర్సీపట్నం నియోజవర్గ నాయకులు కిరణ్ పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంపై వ్యాఖ్యలు అభ్యంతరకరం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన అభ్యంతర వ్యాఖ్యలను ఖండిస్తున్నామని జనసేన పార్టీ ఉత్తరాంధ్ర ఎలక్షన్ ప్రచార కమిటీ మెంబర్ అద్దేపల్లి గణేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఏ వ్యక్తిని కించపరిచే విధంగా మాట్లాడటం మంచిది కాదన్నారు. వేల కోట్లు అవినీతిపరులైన మీరు పవన్ కోసం మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పంచాయతీలు వ్యవస్థని సర్వనాశనం చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో కూడా పర్యటించి రోడ్లు వేసిన ఘనత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి రాజా, కొప్పాక కళ్యాణ్, తాతబాబు, అనిల్, చిట్టిబాబు, స్వామి, ఈశ్వర్, మురళి,త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు గ్రామంగా జెడ్.కొత్తపట్నం ఎంపిక

ప్రజాశక్తి -కొత్తకోట:ప్రకృతి వ్యవసాయ గ్రామంగా జెడ్ కొత్త పట్నం గ్రామాన్ని ఎంపిక చేసినట్లు రావికమతం మండల వ్యవసాయ అధికారిని ఎ.రూప తెలిపారు. జెడ్ కొత్తపట్నం గ్రామ సచివాలయంలో శుక్రవారం వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయశాఖ, వెలుగు సిబ్బంది తదిత ర శాఖ ల ఆధ్వర్యంలో స్థానిక రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రావికమతం మండలం లో జెడ్ కొత్త పట్నం గ్రామాన్ని నూరు శాతం ప్రకృతి వ్యవసాయ గ్రామంగా మార్చేందుకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా రాబోయే తొలకరి ఖరీఫ్ సీజన్‌లో రైతులందరూ పంటలను సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి సహజ సిద్ధంగా లభ్యమయ్యే వనరులతో తయారుచేసిన కషాయలను, గోమూత్రం, పేడతో తయారు చేసిన ఎరువులను మాత్రమే ఉపయోగించాలన్నారు. ఈ పద్ధతులను పాటించడంతో రైతులకు పంట పెట్టుబడులు తగ్గి, నాణ్య మైన పంట తో పాటు అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ గాలి తారకం, ఎంపిఈవో రమణ బాబు పాల్గొన్నారు.

కవగుంటలో కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి -రావికమతం:మండలంలోని కవగుంట గ్రామంలో సర్పంచ్ దాసరి సూర్య కుమారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి ఆసుపత్రి సౌజన్యంతో కవగుంట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 40 మంది రోగులు హాజరయ్యారు. వీరికి కంటి వైద్య నిపుణులు వై.నాయుడు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 8 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని, మరొక 9 మందికి కంటి అద్దాలు అవసరం అని గుర్తించారు.

రికార్డులు తనిఖీ చేసిన సిఇఒ

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయ రికార్డులను జిల్లా పరిషత్ సీఈఓ ఈ నారాయణమూర్తి శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా జిల్లా పరిషత్ కార్యాలయం పీవీ వివన్ మూర్తి, జూనియర్ అసిస్టెంట్ రామరాజు రికార్డులను క్షుణంగా పరిశీలించి సిఈఓ నారాయణమూర్తి కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సీతారామరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అన్నింటా ఆమె

▶▶ సమాజాభివృద్ధిలో స్త్రీలు కీలకపాత్ర

▶▶ నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మానవ సమాజంలో మహిళలది కీలక పాత్ర. స్త్రీ లేనిది జననం లేదు. స్త్రీ లేనిదే జగత్తు లేదు. యావత్తు సమాజానికి ఆమెనే మూలం. అమ్మగా మనకు జన్మనిస్తుంది. ఆలిగా మన సంసారాన్ని నడుపుతుంది. సోదరిగా మనకు ఆప్యాయతలు పంచుతుంది. ఈ అమూల్య బంధాలతోనే కుటుంబ వ్యవస్థ ముడిపడి ఉంటుంది. మానవ సమాజానికి పునాదిగా నిలుస్తోంది. పూర్వ కాలంలో వారికి సమున్నత గౌరవం దక్కేది. నేడు పితృస్వామ్య వ్యవస్థలు వేళ్లూనుకుని ఆమెను అగాధంలోకి నెట్టేస్తున్నాయి. అయినప్పటికీ మేటి విలువలతో రాణిస్తున్న మహిళామణులు ఎందరో ఉన్నారు. విభిన్న రంగాల్లో వారు మేలైన విజయాలను సొంతం చేసుకుంటున్నారు. వారి స్ఫూర్తి రేపటి ఆశతో ముందడుగు వేసే నేటి మహిళకి ఆదర్శం. వివక్ష, అసమానతల్లాంటివి వెనక్కి లాగుతున్నా తన జీవన పరిధిని విశాలం చేసుకుంటూ మహిళ ఉన్నతంగా ఎదుగుతోంది. అడుగులు తడబడుతున్నా ఆ తరుణీమణి పట్టుదలగా ముందుకు సాగిపోతోంది.

నాడు - నేడు

అనాదిగా మన దేశంలో స్త్రీలు పూజింపబడుతూ వచ్చారు. నాటి భారత సమాజంలో మహిళలు ఎంతో గౌరవింపబడేవారు. రాను రాను సంప్రదాయాల ముసుగులో మహిళలను వంటింటికే పరిమితం చేశారు. నాడు ఆమెను బయటకు రానీయకుండా ఆంక్షలు పెట్టారు. దాంతో చదువులకు, సమాజానికి దూరంగా నాలుగు గోడల మధ్యనే నలిగేది స్త్రీ జీవితం. మన దేశంలో సావిత్రిభాయి పూలే స్త్రీ విద్యా వ్యాప్తికి నడుం బిగించారు. మొట్టమొదటగా దేశంలో మహిళా పాఠశాలలను నడిపించి స్త్రీ విద్యా ప్రాధాన్యతను చాటి చెప్పారు. స్త్రీ విద్యను ఎంతగానో ప్రోత్సహించారు. రానురాను దేశంలో స్త్రీ విద్య వ్యాప్తి చెందింది. పురుషులతో సమానంగా ఉన్నత చదువులు, ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు. సైన్యంలో చేరి దేశ రక్షణ బాధ్యతలు చేపడుతున్నారు. నేడు మహిళలు పురుషులతో సమానంగా ఆటోలు, కార్లు, బస్సులు, రైళ్ళు నడుపుతున్నారు. హిమ శిఖరాలను అధిరోహిస్తున్నారు. ఆటల్లో రాణిస్తున్నారు. అంతరిక్షయానం చేస్తున్నారు.

అయినా, అంతటా వివక్ష

నాటి సమాజంలో కట్నాలిచ్చి మహిళను పెళ్ళి చేసుకునే వారు. నేడు కట్నాలు తీసుకొని పెళ్ళి చేసుకుంటున్నారు. అదనపు కట్నాల కోసం హింసిస్తున్నారు. చదువుకుందామని పాఠశాలలకు వెళితే అక్కడా ర్యాగింగ్ పేరుతో హింసే. అన్నీ దాటుకొని చదువులు పూర్తి చేసి ఉద్యోగాలకు వెళితే అక్కడా వేధింపులే ఎదురవుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న సమాజంలో స్త్రీల పట్ల వివక్ష పెరుగుతోంది. దీనికంతటికీ పురుషాధిక్యమే కారణమంటోంది మహిళా లోకం.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
" స్త్రీల సమాన భాగస్వామ్యంతోనే దేశం అభివృద్ధి పథంలో పురోగమిస్తుంది"
కె.రాణీ ప్రమీల

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
"సహనానికి ప్రతీకగా, ప్రేమకు ప్రతి రూపంగా, కుటుంబ వ్యవస్థకు పట్టుగొమ్మగా, సమాజంలో మహిళ స్థానం మహోన్నతమైనది"
సోదరీమణులకు, సహచర మహిళలకు, బంధుమిత్రులకు, హృదయపూర్వక శుభాకాంక్షలు
డా॥ఎస్.జి.ప్రశాంతి
పశువైద్యాధికారి, ఆర్.తాళ్లవలస
భీమునిపట్నం మండలం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
"సహనానికి ప్రతీకగా, ప్రేమకు ప్రతి రూపంగా, కుటుంబ వ్యవస్థకు పట్టుగొమ్మగా, సమాజంలో మహిళ స్థానం మహోన్నతమైనది"
సోదరీమణులకు, సహచర మహిళలకు, బంధుమిత్రులకు, హృదయపూర్వక శుభాకాంక్షలు
డా॥పి. శ్రీవాణి ప్రిన్సిపాల్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
తగరపువలస, విశాఖపట్నం జిల్లా

అంతర్జాతీయ మహిళాదినోత్సవ శుభాకాంక్షలు
డా॥ కె.వై.నాగప్రియ
"సమానత్వ భావన వెల్లి విరియాలి మహిళా సాధికారత సాధించాలి"
B.H.M.S. M.D. (Homoeo) M.Sc., (PSY) Cell : 88977 85861
మాతృశ్రీ హోమియో క్లినిక్ స్త్రీలకు ప్రత్యేకం
శివాలయం వీధి, మూడుగుళ్ళు అమ్మవారి గుడి ప్రక్కన సంగివలస, తగరపువలస, విశాఖపట్నం.
Timings : 10.00 A.M. to 1.00 P.M. 5.00 P.M. to 8.00 P.M.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోదరీమణులకు, సహచర మహిళలకు, బంధుమిత్రులకు, హృదయపూర్వక శుభాకాంక్షలు
ప్రముఖ మహిళా న్యాయవాదులు: సురేఖ, హేమలత, అనసూమ, లక్ష్మీదుర్గ, హేమమాలిని
మహిళా ప్రొఫెసర్స్: శోభారాణి (ఎ.యు), వనిత (ఎ.యు), విజయశాంతి (ఎ.యు), విజయలక్ష్మీ (ఎ.యు), బి.వి.పద్మ (సీనియర్ అసిస్టెంట్), కె.కుమారి (జూనియర్ అసిస్టెంట్)
విశాఖపట్నం.

మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
ఈ రోజు ప్రత్యేకమైన దినం దేవుడు నిండు నూరేళ్లు ఆయుస్సు ఇవ్వాలని కోరుతూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
HAPPY BIRTHDAY
UPMAKA NEELIMA
A.U. Visakhapatnam
మిత్రులు, బంధుమిత్రులు - విశాఖపట్నం.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోదరీమణులకు సహచరమహిళలకు, బంధుమిత్రులకు, హృదయపూర్వక శుభాకాంక్షలు
డా॥ చిట్టారెడ్డి శోభాదేవి M.S.D.G.O.
స్త్రీలు, మరియు ప్రసూతి వైద్యనిపుణులు,
సెల్ : 9490459479
తల్లి పిల్లల ఆసుపత్రి
డోర్.నెం. 7-44-123, పాత లోకల్ ఆఫీస్ వీధి, తగరపువలస, విశాఖపట్నం - 531162
Timings : A.M : 7.00 to 9.00, PM : 5.00 to 9.00

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోదరీమణులకు, సహచర మహిళలకు, బంధుమిత్రులకు, హృదయపూర్వక శుభాకాంక్షలు
కుదర కోమలి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్
ఎన్.ఎ.డి. జంక్షన్, విశాఖపట్నం.

అంతర్జాతీయ మహిళాదినోత్సవ శుభాకాంక్షలు
KRISHNA MATERNITY & NURSING HOME
LAPAROSCOPIC CENTER
NABH ACCREDITED HOSPITAL
ISO 9001 Certified Hospital
Qualified Gynaecologists and Paediatrician available round the clock
Having tie-up with all major Health Insurance Companies and TPA's.
In Service of people Since 1985.
D.No. 43-5-53, Railway New Colony, Visakhapatnam-16
Cell : 0891-2720769, 2735571
Dr. K. KAMALA MBBS

సోదరీమణులకు, సహచర మహిళలకు, బంధుమిత్రులకు,
మహిళాదినోత్సవ శుభాకాంక్షలు
Sri Sai Sampath
HASINI PLAY SCHOOL
A Great Place to Grow
మా బ్రాంచ్‌లు : తగరపువలస, వలందపేట,
ఫోన్ నెంబర్లు : 7207510259, 79977 55599
Principal : D.A.V. POORNIMA M.A.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
SUN FLOWER
SILVER JUBILEE SCHOOL
AN ENGLISH MEDIUM SCHOOL
Admissions Open
Recognised by the Govt of AP
Nursery to X STD
Mithilapuri Vuda Colony, Madhurawada, VSP.
Ph : 0891-2713326, 2735344, 9849912049

టి.నగరపాలెం గ్రామపంచాయితీ ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
పొట్నూరు చంద్రశేఖర్
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ అధ్యక్షులు
పొట్నూరు ఛాయా గౌతమి
సర్పంచ్, టి.నగరపాలెం గ్రామ పంచాయితీ
భీమునిపట్నం మండలం, విశాఖ జిల్లా.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
బుచ్చయ్యపేట మండలం లోపూడి-2 అంగన్‌వాడీ సెంటర్‌ను సమర్థవంతంగా నిర్వహించినందుకు అంగన్‌వాడీ టీచర్
కడియం జ్యోతికి
మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ టీచర్ అవార్డు తీసుకోవడం జరిగింది.
ఈ సందర్భంగా తన తోటి మిత్రులు, బందువులు హృదయపూర్వక శుభాకాంక్షలు

అంతర్జాతీయ మహిళాదినోత్సవ శుభాకాంక్షలు
సోదరీమణులకు, సహచర మహిళలకు, బంధుమిత్రులకు, మహిళాదినోత్సవ, శుభాకాంక్షలు
K.JYOTHI KAMALA (M.A., B.Ed.,)
Gold Donor
President : (Dy Governor)
VANITHA WALKERS CLUB
Flat No. 89, Srinivasa Paradise, Near Carshed Junction.
P.M.Palem, Visakhapatnam.
Cell : 8897132554, 8309356673